


శాస్త్రోక్తంగా పల్లకీ సేవ

శ్రీశైలంటెంపుల్: భ్రమరాంబామల్లికార్జున స్వామి వార్లకు ఆదివారం పల్లకీ సేవను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ప్రత్యేక పూజలనంతరం ఉత్సవమూర్తులతో ఆలయ ప్రదక్షిణ చేశారు.



'ఆదర్శ' విద్య

మెరుగైన సౌకర్యాలతో మోడల్ స్కూళ్లు విద్యార్థులకు ఆహ్వానం పలుకుతున్నాయి. గ్రామీణ బాల, బాలికలకు 6వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ మొదలైంది. 8లో



టీడీపీ నేత భూ దందాలు

తప్పుడు పత్రాలతో కబ్జాలకు పాల్పడుతూ నంద్యాల జిల్లాకు చెందిన టీడీపీ నేత దందాలు కొనసాగిస్తున్నారు. నంద్యాల జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి ఈ వివరాలను వెల్లడించారు. 8లో

ఈజీగా.. స్మార్ట్‌గా!

టెక్నాలజీతో 'స్మార్ట్'గా మారిన జీవన విధానం

- స్మార్ట్‌ఫోన్లు, ఇంటర్నెట్‌రాకతో అన్ని రంగాల్లో భారీ సంస్కరణలు
- లావాదేవీల నుంచి చిరునామాల వరకూ అన్నిటికీ 'స్మార్ట్' పరిష్కారం
- ఫోన్‌పే, గూగుల్‌పేతో చెల్లింపులు సులభతరం
- ఆర్టీసీ బస్సులోనూ డిజిటల్ చెల్లింపులు
- ఎంటర్‌టైన్ మెంట్ రంగంలో పెనుమార్పులు
- ప్రతీ వంద మందిలో 46 మంది ఆన్‌లైన్ బిజినెస్
- భవిష్యత్‌లో మరిన్ని విప్లవాత్మక మార్పులు వస్తాయంటున్న నిపుణులు





➡ 15 ఏళ్ల కిందట ఎక్కడికైనా వెళ్లాలంటే దారిలోని ప్రతీ ఒక్కరినీ కలిసి 'అన్నా, అయ్యా...వలానా అడ్రస్ ఎక్కడ' అని పదే పదే అడిగి తిప్పలు పడుతూ గమ్యాన్ని చేరుకునే వాళ్లం. ఇప్పుడు 'గూగుల్ మ్యాప్స్' రావడంతో 'లైవ్ లొకేషన్' షేర్ చేసుకుని ఫోన్‌లో దారి చూసుకుంటూ దూసుకుపోతున్నాం.

➡ సినిమాలకు వెళ్లాలంటే గంట ముందు వెళ్లి బుకింగ్‌లో క్యూలో నిల్చుని తోపులాడుకుంటూ నలిగిపోయి అతికష్టం మీద టిక్కెట్లు తీసుకుని థియేటర్‌లోకి వెళ్లేవారు. ఇప్పుడు మొబైల్‌లో మనకు కావాల్సిన సీట్లను ఎంచుకుని సమయానికి దర్జాగా హాలులోకి అడుగుపెడుతున్నాం

➡ ఇల్లు కట్టి చూడు, పెళ్లి చేసి చూడు అనేవాళ్లు పెద్దలు. పెళ్లిలో 'పెళ్లిపిలుపు' ప్రక్రియే పెద్ద ప్రహసనం. నెల, నెలన్నర ముందు నుంచి బంధువులు, స్నేహితుల ఇళ్లకు తిరిగి పేరు పేరునా పత్రిక ఇచ్చి పిలిచేవారు. సరిగా పిలవలేదని బంధువులు అలిగేవారు కూడా! కాలం మారింది. 'వెడ్డింగ్ ఇన్విటేషన్' వీడియోలను సిద్ధం చేసి 'వాట్సాప్'లో షేర్ చేస్తున్నారు. ఫోన్ చేసి స్వయంగా రాలేకపోతున్నాం. తప్పనిసరిగా రావాలని ఆహ్వానిస్తున్నారు. టెక్నాలజీ వచ్చాక 'పెళ్లిపిలుపు'లు సులభమయ్యాయి.

➡ మౌలాలి కోడుమూరుకు ఆర్టీసీ బస్సు ఎక్కాడు. టిక్కెట్ ఇవ్వాలని కండక్టర్ చేతిలో రూ.500నోటు పెట్టారు. చిల్లర లేదు. ఫోన్ పే చేయాలని కండక్టర్ చెప్పడంతో డబ్బు ఫోన్ పే చేశాడు. గతంలో చిల్లర లేకపోతే టిక్కెట్ వెనుక రాసి, బస్సు దిగాక మరొక వ్యక్తికి చిల్లర ఇవ్వాలని చికాకు తెప్పించేవారు. ఫోన్ పే అనేది ఇప్పుడు జీవనంలో భాగమైంది.

ఇలా ఒకటి కాదు...రెండు కాదు...టెక్నాలజీతో ప్రతీ పని సులువైంది. ఇంటర్నెట్, స్మార్ట్‌ఫోన్ అనే రెండు కొత్త టెక్నాలజీలు క్లిష్టమైన పనిని కూడా సులువుగా, ఎక్కువ సమయం వృథా అయ్యే పనులు కూడా క్షణాల్లో అయ్యేలా చేస్తున్నాయి. ఒక రకంగా చెప్పాలంటే టెక్నాలజీ ప్రభావంతో ప్రతీ శాఖ కూడా తమ పాలనలో మార్పులు చేసుకుంది. సంస్కరణలతో పాత విధానాలు కనుమరుగయ్యే పరిస్థితి వచ్చింది. ప్రతీ ఒక్కరూ కొత్త టెక్నాలజీకి అనివార్యంగా అలవాటు పడాల్సి వచ్చింది. లేదంటే పనులు ముందుకు కదిలే పరిస్థితి కూడా లేదు.

సాక్షిప్రతినిధి, కర్నూలు: ఇంటర్నెట్ అనేది తీవ్ర ప్రభావం చూపిస్తోంది. ప్రస్తుతం 4జీ నుంచి 5జీ టెక్నాలజీకి వచ్చింది. స్మార్ట్‌ఫోన్ల రాకతో ప్రతీ ఇంట్లోకి ఇంటర్నెట్ వచ్చింది. రాష్ట్రంలో 94.7 శాతం ఇళ్లలో ఇంటర్నెట్ ఉందని సర్వే సంస్థలు చెబుతున్నాయి. అలాగే 'ఫైబర్' కూడా వేగంగా విస్తరిస్తోంది. ఇంటర్నెట్ స్పీడ్ పెరగడంతో ఇళ్లలోని స్మార్ట్ టీవీల్లో ఇంట్లోనే ఓటీటీల్లో సినిమాలు చూసుకుంటున్నారు. పాతికేళ్ల కిందట సినిమా చూడాలంటే వీసీఆర్‌లు, క్యాసెట్‌లు అద్దెకు తెచ్చుకుని చూసువాళ్లు! ఆపై వీసీడీ, డీవీడీలు వచ్చాయి. ఇప్పుడు నేరుగా ఓటీటీ, యూట్యూబ్‌లో సినిమాలు ప్లే అవుతున్నాయి. పాటలు వినాలంటే టేప్‌రికార్డుల్లో వినేవాళ్లు. సీడీ, పెన్‌డ్రైవ్‌ల నుంచి ఇప్పుడు 'వింక్' 'అమెజాన్', 'యాపిల్ మ్యూజిక్' లాంటి యాప్స్ వచ్చాయి. కోరిన సినిమా, పాట క్షణాల్లో ఫోన్‌లో, టీవీలో ప్లే అవుతోంది. ఇంటర్నెట్ స్పీడ్ కూడా అద్భుతమైన క్లారిటీ వచ్చేలా ఉంది. బ్లాక్ అండ్ వైట్ సినిమాల నుంచి 4కే, 8కే వరకూ మంచి క్లారిటీతో ఉన్న సినిమాలు చూస్తున్నాం.

పెరిగిన ఆన్‌లైన్ షాపింగ్

స్మార్ట్‌ఫోన్ల వాడకం పెరిగిన తర్వాత 'షాపింగ్' కోసం ఇబ్బందులు పడకుండా ఇంట్లో కూర్చుని వందల కొద్దీ ఉత్పత్తులు తీరిగ్గా చూసి నచ్చినవాటిని కొనుగోలు చేస్తున్నారు. దుస్తులు, హోం నీడ్స్, ఎలక్ట్రానిక్స్‌తో పాటు అన్ని రకాల వస్తువుల కోసం 'ఆన్‌లైన్' షాపింగ్ పెరిగింది. అమెజాన్, ఫ్లిప్‌కార్డ్, టాటాక్లిక్‌తో పాటు ఎన్నో యాప్స్ అందుబాటులోకి రావడం, భారీగా ఆఫర్లు ప్రకటించడంతో ఎక్కువశాతం 'ఆన్‌లైన్ బిజినెస్' చేస్తున్నారు. ఇండియాలో 46.7శాతం 'ఆన్‌లైన్' షాపింగ్ చేస్తున్నారు. 2024–25లో ఇది 55శాతాన్ని దాటుతుందని ఈకామర్స్ మార్కెట్‌లు అంచనా వేస్తున్నాయి. కరెంటు బిల్లులు, గ్యాస్ బుకింగ్, గ్యాస్ బిల్లులు, ఎల్ఐసీ ఇన్సురెన్స్‌లు, బ్యాంకులో క్రెడిట్, డెబిట్, ఈఎంఐలు ప్రతీది 'స్మార్ట్' అయింది. అలాగే పాతికేళ్ల కిందట బంధువులు, స్నేహితులకు సందేశాలు పంపాలంటే లేఖలు రాసేవారు, విదేశాల్లో ఉన్నవారు క్యాసెట్లలో మాట్లాడి పంపేవారు. ఆపై ల్యాండ్‌ఫోన్లు, సెల్‌ఫోన్‌లు, ఇప్పుడు ఏకంగా వీడియోకాల్స్, గ్రూపుకాల్స్ చేస్తున్నారు. ప్రపంచంలో ఎక్కడా ఉన్నా ఒకరినొకరు చూసుకుని మాట్లాడుతున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు కంపెనీలు ఉద్యోగులతో సమావేశాలు నిర్వహించాలన్నా వీడియో కాన్ఫరెన్స్, జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్నారు. చివరకు సూపర్ మార్కెట్‌లోకి వెళితే సరుకులు కూడా 'స్మార్ట్' బిల్లింగ్ చేసి నిమిషాల్లో బయటకు వస్తున్నారు. కార్లలో ప్రయాణిస్తే టోల్‌గేట్ వద్ద నగదు చెల్లింపులు లేకుండా 'ఫాస్ట్‌టాగ్' చేసి ముందుకెళుతున్నారు. ఇలా ప్రతీ అంశం కూడా 'స్మార్ట్' అయింది.

వెబ్ చానళ్లు...కొత్త విప్లవం



ఎవరిలో ఉన్న టాలెంట్‌ను వారు ప్రపంచానికి చెప్పుకునేందుకు టిక్‌టాక్ వీడియోలు చేస్తున్నారు. వీడియోలు తీసుకుని వారే సొంతంగా వెబ్‌చానల్ ప్రారంభించి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. వీటి ద్వారా 'టాలెంట్' ప్రపంచానికి చెప్పడంతో పాటు వీక్షకులను బట్టి ఆర్థికంగా కూడా లాభపడుతున్నారు. రానున్న 5–10 ఏళ్లలో టెక్నాలజీ మరింత అభివృద్ధి చెంది విప్లవాత్మక మార్పులు వస్తాయని, దాంతో జీవన విధానం మరింత 'స్మార్ట్'గా మారుతుందని నిపుణులు చెబుతున్నారు.



వైద్యరంగంలో పెనుమార్పులు

టెక్నాలజీ ప్రభావం వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చింది. డయాగ్నోసిస్(వ్యాధినిర్ధారణ) పెరిగింది. ఎక్స్‌రే నుంచి పెట్‌స్కాన్ వరకూ శరీరంలో అణవణువు పరీక్షించి సమస్య ఏంటని వైద్యులు చెబుతున్నారు. అడ్వాన్స్‌డ్ ల్యాప్రోస్కోపితో పాటు అత్యాధునిక టెక్నాలజీతో చికిత్స చేస్తున్నారు. అలాగే స్మార్ట్‌వాచ్‌లు వచ్చాక శరీరంలో బీపీ, హార్ట్‌బీట్, రోజూ ఎంత దూరం వాకింగ్ చేస్తున్నాం, ఎంత శక్తి ఖర్చవుతుంది..ఇలా చాలా అంశాలను 'స్మార్ట్'గా తెసుకుంటున్నారు.

కాలానికి అనుగుణంగానే..



కాలానికి అనుగుణంగా ముందుకు సాగాల్సిందే. ప్రస్తుతం డిజిటల్ టెక్నాలజీ నడుస్తోంది. అన్నీ ఈజీ గోయింగ్‌గా మారాయి. మనం ఉన్నచోటు నుంచే మనకు కావాల్సిన వాటిని టెక్నాలజీ ద్వారా సులభంగా తక్కువ సమయంలో పొందగలుగుతున్నాం. ఆన్‌లైన్ ద్వారా పేమెంట్స్ చేస్తున్నాం. సినిమా టికెట్స్ బుక్ చేసుకోవడం, నచ్చిన దుస్తులు, కావాల్సిన బ్యూటీ కిట్స్, ఫుడ్ ఐటమ్స్ ఒక్కటేమిటీ సకలం టెక్నాలజీ ద్వారానే కార్యకాలపాలు చేసుకుంటున్నాం. – సౌజన్య, కర్నూలు

అన్నీ ఆన్‌లైన్ ద్వారానే..



టెక్నాలజీ పెరగడంతో అన్ని ఆన్‌లైన్, మొబైల్ ద్వారా ఆపరేటింగ్ చేసుకుంటున్నాం. ఏది కావాలన్నా ఇంట్లో ఉండే ఆర్డర్స్ చేపుకోవచ్చు. ఆర్డర్ చేసిన ఐటమ్ ఇంటివద్దే డెలివరీ చేస్తున్నారు. టెక్నాలజీ పెరడంతో ఈజీ యాక్సెస్ జరుగుతోంది. సమయం ఆదా కావడంతో పాటు బయటికి వెళ్లి వచ్చే ఖర్చు తగ్గుతుంది. రైల్వే, బస్ టికెట్స్, సినిమా టికెట్స్ బుక్ చేసుకోవడం, కరెంట్ బిల్, డిష్‌బిల్ లాంటివి అన్నీ డిజిటల్ పేమెంట్స్ చేసుకుంటున్నాం. డిజిటల్ ట్రాన్సాక్షన్స్ విషయంలో జాగ్రత్తగా ఉండాలి. – ప్రదీప్ యాదవ్, అసిస్టెంట్ ప్రొఫెసర్, జి.పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల

న్యూస్‌రీల్

పాఠశాలల ప్రారంభం రోజే విద్యాకానుక



సమ దుస్తుల కొలతలు చూస్తున్న దృశ్యం

కృష్ణగిరి: ఈ ఏడాది పాఠశాలల ప్రారంభం రోజునే విద్యా కానుక అందజేసేందుకు అన్ని చర్యలు తీసుకున్నామని రాష్ట్ర సమగ్ర శిక్ష కార్యాలయ అధికారి రవీంద్రబాబు తెలిపారు. ఆదివారం ఆయన జిల్లా సమగ్ర శిక్ష ఏపీసీ డాక్టర్ వేణుగోపాల్, సీఎంఓ రాజేశ్వరితో కలిసి కృష్ణగిరి, వెల్దుర్తి మండలాల్లో ఏర్పాటు చేసిన జగనన్న విద్యాకానుక స్టాక్ పాయింట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదివే 2,92,955 మంది విద్యార్థులకు విద్యా కానుక కిట్లు అందజేస్తున్నట్లు చెప్పారు. ఈ ఏడాది ప్రతి మండల కేంద్రంలో స్టాక్ పాయింట్లను ఏర్పాటు చేసి విద్యా కానుక కింద అందజేసే 8 రకాల వస్తువులను అక్కడికి చేర్చామన్నారు. జిల్లాలో ఇప్పటివరకు 14 మండలాలకు యూనిఫాం, 18 మండలాలకు షూలు చేర్చామన్నారు. అలాగే 32,640 ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీలు కూడా జిల్లాకు చేరాయన్నారు.

స్కూల్ అసిస్టెంట్లకు ఐదు రోజుల శిక్షణ

కర్నూలు సిటీ: రాయలసీమ జిల్లాల్లో 2018 డీఎస్సీ ద్వారా ఎంపికైన స్కూల్ అసిస్టెంట్ టీచర్లకు నేటి(సోమవారం)నుంచి శిక్షణ తరగతులు నిర్వహించేందుకు ఏర్పాట్లు సిద్ధం చేశారు. నంద్యాల జిల్లాలోని మిడుతూరు ఏపీ మోడల్ స్కూల్‌లో ఐదు రోజుల పాటు ఈ శిక్షణ తరగతులు నిర్వహించనున్నారు. ఉమ్మడి కర్నూలు, అనంతపురం, చిత్తూరు, వైఎస్సార్ కడప జిల్లాలకు చెందిన 13 మంది సోషల్ టీచర్లు, 10 మంది రిసోర్స్ పర్సన్లు శిక్షణకు హాజరుకానున్నారు.

నేడు కలెక్టరేట్‌లో 'స్పందన'

కర్నూలు(సెంట్రల్): ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందనలో భాగంగా సోమవారం ఉదయం 10 నుంచి 2 గంటల వరకు కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో ప్రజల నుంచి వినతులను స్వీకరించనున్నట్లు కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంతోపాటు అన్ని మండల, డివిజన్, మునిసిపల్ కార్యాలయాల్లో కూడా స్పందన కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు.

నేటి నుంచి ఇంటర్ అడ్మిషన్లు

కర్నూలు సిటీ: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్ జూనియర్ కాలేజీల్లో 2023–24 విద్యా సంవత్సరానికి ఇంటర్మీడియెట్ అడ్మిషన్స్ నేటి నుంచి(సోమవారం) ప్రారంభం కానున్నట్లు ఇంటర్మీడియెట్ బోర్డు ప్రాంతీయ కార్యాలయ అధికారి గురవయ్య శెట్టి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మిగనూరులోని జీనియస్ గ్లోబల్ జూనియర్ కాలేజీని ప్రారంభించారని, ఆ కాలేజీకి ఇంటర్మీడియెట్ బోర్డు నుంచి ఎలాంటి అనుమతులు లేవని పేర్కొన్నారు.

శ్రీ మఠంలో భక్తుల రద్దీ



బారులు తీరిన భక్తులు

మంత్రాలయం: శ్రీ రాఘవేంద్రస్వామిని దర్శించుకునేందుకు ఆదివారం భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ముందుగా తుంగభద్రనదిలో పుణ్యస్నానాలు ఆచరించి గ్రామ దేవత మంచాలమ్మ, శ్రీ రాఘవేంద్రస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. తెల్లవారుజాము నుంచి పీఠాధిపతి శ్రీ సుభుధేంద్రతీర్థుల ఆశీస్సులతో మూలబృందావనానికి నిర్మల్య విసర్జన, ఫల, పుష్ప, క్షీరా, పంచామృతాభిషేకాలు నిర్వహించి మహా మంగళ హారతులిచ్చారు. సాయంత్రం ఉత్సవ మూర్తి ప్రహ్లాదరాయులను చెక్క, బంగారు, నవరత్న రథాలపై కొలువుంచి శ్రీ మఠంలో ఊరేగించారు.

19న క్వాలిటీ కంట్రోల్‌పై ఏవో, ఏడీఏలకు ప్రత్యేక శిక్షణ

కర్నూలు(అగ్రికల్చర్): వ్యవసాయ శాఖ క్వాలిటీ కంట్రోల్‌పై ఈ నెల 19న మండల వ్యవసాయ అధికారులు, సబ్ డివిజనల్ ఏడీఏ, జిల్లా వ్యవసాయ అధికారులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం జరగనుంది. క్వాలిటీ కంట్రోల్ విధి విధానాలపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించేందుకు వ్యవసాయ శాఖ కమిషనరేట్ నుంచి ప్రత్యేక టీమ్ జిల్లాకు రానుంది. ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు క్వాలిటీ కంట్రోల్‌లోకి వస్తాయి. నెల వారీగా వీటి శ్యాంపుల్స్ ఎలా తీయాలి, ల్యాబ్‌కు పంపడంపై శిక్షణ ఇవ్వనున్నారు.





గడ్డి టోపీ.. గట్టి రక్ష

ఎండలు మండిపోతున్నాయి. అత్యవసర పనిమీద బయటకు వెళ్లేవారు టోపీలు ధరిస్తున్నారు. కొందరు గొడుగుల నీడన నడుస్తున్నారు. మరి కొందరు టవాళ్లను రక్షణగా వాడుతున్నారు. దొర్నిపాడు మండలం క్రిష్టిపాడుకు చెందిన లక్ష్మమ్మ మాత్రం గడ్డి పోచలతో టోపీ తయారు చేసి ఔరా అనిపించారు. మిర్చి కోత పనుల్లో ఈ టోపీ ధరించి భానుడి భగభగల నుంచి ఉపశమనం పొందుతున్నారు.
– దొర్నిపాడు

12 కేంద్రాల్లో ఏపీ ఈఏపీ సెట్

- నేటి నుంచి ఈనెల 19 వరకు నిర్వహణ



కర్నూలు కల్చరల్: ఏపీ ఈఏపీ సెట్‌కు నిర్వహణకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 12 కేంద్రాల్లో పరీక్షలను నిర్వహించనున్నారు. కర్నూలు జిల్లా కేంద్రంలో ఏడు, ఎమ్మిగనూరులో ఒకటి, నంద్యాల జిల్లా కేంద్రంలో నాలుగు కేంద్రాలను ఏర్పాటు చేశారు. సోమవారం నుంచి ఈనెల 19వ తేదీ వరకు ఇంజినీరింగ్ స్ట్రీమ్, ఈనెల 22,23 తేదీల్లో అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ పరీక్షలు జరగనున్నాయి. కర్నూలు జిల్లాలోని 8 కేంద్రాల్లో ఇంజినీరింగ్ పరీక్షలకు 9,204 మంది, నంద్యాల జిల్లాలోని 4 కేంద్రాల్లో 4,395 మంది, అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ పరీక్షలకు కర్నూలు జిల్లాలో 7462 మంది, నంద్యాల జిల్లాలో 2,205 మంది హాజరుకానున్నారు. ప్రతి రోజు ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్లలో పరీక్షలు జరగనున్నాయి. ఉదయం సెషన్‌లో 7.30 గంటల నుంచి పరీక్షా కేంద్రాల్లోకి అనుమతి ఇస్తారు. నిర్దేశించిన సమయానికి రెండు గంటల ముందుగా పరీక్ష కేంద్రాలకు విద్యార్థులు చేరుకోవాలని ఏపీ ఈఏపీ సెట్ అధికారులు పేర్కొన్నారు. పరీక్షల్లో నెగటివ్ మార్కింగ్ లేదు.

పకడ్బందీ ఏర్పాట్లు

కర్నూలు(సెంట్రల్): ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ, బీఎస్సీ నర్సింగ్ కోర్సుల్లో ప్రవేశాల కోసం సోమవారం నుంచి ఈ నెల 19వ తేదీ వరకు ఏపీ ఈఏపీ సెట్ నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు డీఆర్వో ఎస్వీ నాగేశ్వరరావు తెలిపారు. పరీక్ష నిర్వహణపై సంబంధిత అధికారులతో ఆదివారం ఆయన టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. కర్నూలులోని దూపాడు అయాన్ డిజిటల్, సనత్ నగర్ అయాన్ డిజిటల్, జి.పుల్లారెడ్డి, బృందావన్, జి.పుల్లయ్య, రవీంద్ర మహిళా, కేవీ సుబ్బారెడ్డి, ఎమ్మిగనూరు సెయింట్ జాన్స్ ఇంజినీరింగ్ కాలేజీల్లో పరీక్ష జరగున్నట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల్లో మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్స్ పరికరాల అనుమతి లేదన్నారు.



కర్నూలు వినాయక్ ఘాట్‌లో పూజలందుకున్న వీర హనుమాన్ విగ్రహం

భజే వాయుపుత్రం

జిల్లాలో ఆదివారం హనుమజ్జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఆంజనేయ స్వామికి ఆకుపూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తిశ్రద్ధలతో హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. పలుచోట్ల రథోత్సవాలు నిర్వహించారు. పవనపుత్రుడి భారీ విగ్రహాలను ఏర్పాటు చేసి పూజలు నిర్వహించారు.
– కర్నూలు కల్చరల్

నిండా నిర్లక్ష్యం

- బోటింగ్ క్లబ్ నిర్వహణలో నిబంధనలు పాటించని కాంట్రాక్టర్
- కనిపించని లైఫ్ జాకెట్లు
- పట్టించుకోని టూరిజం అధికారులు
- గాల్లో కలిసిన ముగ్గురి ప్రాణాలు

బనగానపల్లె: అవుకు రిజర్వాయర్ అధికారుల నిర్లక్ష్యం.. బోటింగ్ నిర్వహణ కాంట్రాక్టర్ కక్కుర్తి వల్ల ముగ్గురి నిండు ప్రాణాలు నీటిలో కలిసిపోయాయి. ఆసియాలోనే పేరుగాంచిన బెలుం గుహల సమీపంలోనే రిజర్వాయర్ ఉండటంతో ఇక్కడికి వచ్చే పర్యాటకుల సంఖ్య శని, ఆదివారాలతో పాటు ఇతర సెలవు దినాల్లోనూ భారీగానే ఉంటోంది. 4.17 టీఎంసీల నీటి సామర్థ్యంతో నిండుకుండలా ఉన్న అవుకు రిజర్వాయర్‌లో బోటింగ్ నిర్వహణ ఆషామాషీ కాదు. అయితే కాంట్రాక్టర్ కాసులకు కక్కుర్తి పడి ఎలాంటి జాగ్రత్తలు తీసుకోకుండానే బోట్లలో యాత్రికులను ఎక్కిస్తున్నారనే విమర్శలున్నాయి.

లైఫ్ జాకెట్ల జాడేదీ..

అవుకు రిజర్వాయర్‌లో బోటు నిర్వహణను దక్కించుకున్న కాంట్రాక్టర్ స్పీడ్ బోటు, ఫ్యామిలీ బోటు, పెడల్ బోటు పేరుతో మూడు బోట్లు తిప్పుతున్నాడు. ఏ బోటులోనైనా ప్రతి యాత్రికుడికి లైఫ్ జాకెట్ తొడిగి ఎక్కించుకోవాలి. గజ ఈతగాళ్లను కూడా బోటులో ఉంచుకోవాలి. ఇవేమీ పట్టించుకోకుండా అనుభవం లేని డ్రైవర్ చేతికి బోటు ఇచ్చి యాత్రికుల నుంచి వసూలైన డబ్బు జేబులో వేసుకోవడమే ధ్యేయంగా కాంట్రాక్టర్ వ్యవహరిస్తుండటంతోనే ఆదివారం ఘటనలో ముగ్గురు ప్రాణాలు కోల్పోవాల్సి వచ్చింది.

అసమర్థ డ్రైవర్ వల్లే..

ప్రమాదానికి గురైన బోటు డ్రైవర్ గంగరాజు అసమర్థత కూడా కారణమని తెలుస్తోంది. కోవెలకుంట్ల ఎస్‌బీ హెడ్ కానిస్టేబుల్ రసూల్ కుటుంబం ఫ్యామిలీ బోటులో ఎక్కారు. వారికి డ్రైవర్ గంగరాజు ఎలాంటి లైఫ్ జాకెట్లు ఇవ్వలేదు. ప్రమాద జాగ్రత్తలూ చెప్పకపోవడంతో పాటు అలలకు ఎదురుగా బోటును తీసుకెళ్లకూడదనే ధ్యాస కూడా లేకుండా పోయింది. మరో విషయమేమిటంటే ఎదురుగా వస్తున్న అలలకు బోటు ఒక సైడ్‌కు వాలినప్పుడు అందులోకి నీరు చేరడంతో యాత్రికులకు ధైర్యం చెప్పి నీటిని తోడేయాలని సూచించాల్సింది పోయి క్షణాల్లోనే నీటిలోకి దూకి ఈదుకుంటూ ఒడ్డుకు చేరి పారిపోయాడు. ఇలాంటి అసమర్థుడిని డ్రైవర్‌గా నియమించుకోవడం కూడా కాంట్రాక్టర్ తప్పిదమేనని తెలుస్తోంది.



బోల్తా పడిన బోటును ఒడ్డుకు తీసుకొస్తున్న దృశ్యం

తీవ్ర విషాదంలో కుటుంబం



రోదిస్తున్న మృతుల కుటుంబ సభ్యులు

అవుకు: అవుకు రిజర్వాయర్ వద్ద జరిగిన బోటు ప్రమాదంలో కోవెలకుంట్ల ఎస్‌బీ హెడ్ కానిస్టేబుల్ రసూల్ బాషా కుటుంబంలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు మృతి చెందడం మరొకరు గల్లంతు అయ్యారు. గల్లంతైన సాజిదా (20) రసూల్ బాషా, మహేశ్వరిల చిన్న కూతురు. ఇటీవల విడుదలైన నీట్ ఫలితాల్లో 504 మార్కులు సాధించింది. మతిచెందిన హసీయా (23) దస్తగిరి, కాశింబిల కుమార్తె. ఈమె తిరుపతిలో ఏజీ ఎమ్మెస్సీ ఫైనల్ ఇయర్ చదువుతుంది. మరో మృతురాలు నూర్‌జహాన్(37) బషీర్ బాషా భార్య. ఈమె నంద్యాలలోని టెక్కె మున్సిపల్ హైస్కూల్‌లో ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వహిస్తున్నారు.

గంట ముందు కూడా ఆన్‌లైన్ ఆర్జిత సేవా టిక్కెట్లు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలదేవస్థానంలో గంట ముందు కూడా ఆన్‌లైన్‌లో కొన్ని ఆర్జిత సేవా టిక్కెట్లను పొందే అవకాశం కల్పించినట్లు దేవస్థానం ఈఓ ఎస్ లవన్న తెలిపారు. ఆదివారం సాయంత్రం ఆయన మాట్లాడుతూ ఈ నెల 1 నుంచి క్షేత్రంలో నిర్వహించే అన్ని ఆర్జిత సేవా టిక్కెట్లు, వీఐపీ బ్రేక్ దర్శనం టిక్కెట్లు అన్నింటిని ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచామన్నారు. భక్తుల సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని శ్రీశైల ఆలయంలో నిర్వహించే సామూహిక అభిషేకాలు, కుంకుమార్చనలు, గణపతి హోమం, రుద్రహోమం, మృత్యుంజయహోమం, చండీహోమం, శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం, స్వామిఅమ్మవార్ల కల్యాణం, వృద్ధమల్లికార్జునస్వామివారి అభిషేకం, సర్పదోష నివారణ తదితర ఆర్జిత సేవా టిక్కెట్లను ఆయా సేవల ప్రారంభసమయానికి గంట ముందు వరకు కూడా ఆన్‌లైన్‌లో పొందవచ్చన్నారు. కాగా స్వామివారి గర్భాలయం అభిషేకం, స్వామివారి స్పర్శదర్శనం టిక్కెట్లు రెండు రోజులు ముందుగా తీసుకోవాలన్నారు.

క్లుప్తంగా

అప్పుల బాధ తాళలేక వ్యక్తి ఆత్మహత్య

ప్యాపిలి: మండల పరిధిలోని పెద్దపాయ కొట్టాల గ్రామానికి చెందిన కొండా రాజయ్య (52) అప్పుల బాధ తాళలేక ఆదివారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తనకున్న ఎకరా పొలంలో పెట్టుబడుల కోసం, కుటుంబ పోషణకు, కుమార్తె వివాహం కోసం రాజయ్య దాదాపు రూ.10 లక్షల వరకు అప్పు చేసినట్లు గ్రామస్తులు తెలిపారు. కొంత కాలంగా వ్యవసాయంలో నష్టం రావడంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురయ్యాడు. ఈ క్రమంలో రుణదాతల ఒత్తిడి అధికం కావడంతో ఆదివారం గ్రామ శివారులోని డంపింగ్ యార్డులో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పదేళ్ల క్రితం కొండా రాజయ్య రైలు కిందపడి ఆత్మహత్యకు యత్నించి ప్రాణాలతో బయటపడ్డాడు. రాజయ్యకు భార్య భాగ్యమ్మ, ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు జలదుర్గం పోలీసులు తెలిపారు.

శానిటరీ ఇన్‌స్పెక్టర్‌పై కేసు

కర్నూలు కల్చరల్: మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎ.శ్రీనివాసులుపై కేసు నమోదు అయింది. జొహరాపురానికి చెందిన ఈయన దురలవాట్లకు బానిసై అదనపు కట్నం కోసం భార్య సునీతను వేధిస్తుండటంతో ఆమె పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించింది. డబ్బుల కోసం తనను నిత్యం శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నాడని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు వన్‌టౌన్ పోలీసులు శ్రీనివాసులుపై కేసు నమోదు చేశారు.

ఇంటర్ విద్యార్థి అదృశ్యం


సుస్మిత(ఫైల్)

సంజామల: మండల పరిధిలోని ఆకుమల్లకు చెందిన ఇంటర్ విద్యార్థిని అదృశ్యమైనట్లు ఎస్‌ఐ ప్రతాప్ ఆదివారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన వెంకట బాలకృష్ణుడు, నాగేశ్వరి దంపతుల కుమార్తె సుస్మిత కోవెలకుంట్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియెట్ చదువుతుండేది. ఇటీవల విడుదలైన ఫలితాల్లో ఫెయిల్ కావడంతో మళ్లీ పరీక్షలు రాసేందుకు కళాశాలలో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తుండటంతో వెళ్తున్నానని రెండు రోజుల క్రితం కుటుంబ సభ్యులకు చెప్పి వెళ్లింది. సాయంత్రమైనా ఇంటికి రాకపోవడంతో బంధువుల ఊళ్లతో పాటు చుట్టుపక్కల గ్రామాల్లో ఆరా తీశారు. ఆచూకీ లేకపోవడంతో పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

- మరొకరికి గాయాలు

డోన్ టౌన్: మండల పరిధిలోని తాటిమానుకొత్తూరు 44వ జాతీయ రహదారిపై యూ క్రాస్ వద్ద బైకును స్కార్పియో ఢీకొట్టిన ఘటనలో యల్లయ్య(38)అనే వ్యక్తి మృతి చెందగా చంద్రశేఖర్ అనే వ్యక్తికి గాయాలైనట్లు రూరల్ పోలీసులు తెలిపారు. వెల్దుర్తి మండలం బొగోలు గ్రామానికి చెందిన వీరు ఆదివారం ఉదయం బైకుపై డోన్ పట్టణానికి వచ్చి తిరిగి స్వగ్రామానికి వెళుతుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది. మృతునికి భార్య సువర్ణ ఒక కూతురు, కుమారుడు ఉన్నారు. మృతుడి తండ్రి కృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సురేష్ తెలిపారు.

బంగారు భవిష్యత్‌కు ఆదర్శ విద్య



- ప్రైవేట్, కార్పొరేట్‌కు దీటుగా ఏపీ మోడల్ స్కూళ్లు
- 6వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులకు ఆహ్వానం
- ఈ నెల 25తో ముగియనున్న గడువు
- ఒక్కొక్క పాఠశాలకు 100 సీట్లకు పెంపు
- బాలికలకు వసతి సౌకర్యం

అంతర్జాతీయస్థాయి విద్యాప్రమాణాలు.. ఇంగ్లిష్ మీడియం బోధనలు.. మెరుగైన సౌకర్యాలతో జిల్లాలోని మోడల్ స్కూళ్లు విద్యార్థులకు ఆహ్వానం పలుకుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లోని బాల, బాలికలకు 6వ తరగతి నుంచి ఇంటర్ వరకు చదువుకునే అవకాశం ఉండటంతో ఏటా పోటీ పెరుగుతోంది. బాలికలకు వసతి సౌకర్యం కల్పిస్తుండటంతో గ్రామీణ విద్యార్థినులకు వరంగా మారింది. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు కార్పొరేట్ విద్యను అందించాలన్న సంకల్పంతో వైఎస్ఆర్ హయాంలో ఏర్పాటైన ఆదర్శ పాఠశాలలు నేడు సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనలో మరిన్ని సౌకర్యాలు కల్పించడంతో విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను వాటిలో చేర్పించేందుకు ఆసక్తి చూపుతున్నారు.

ఆళ్లగడ్డ: జిల్లాలోని 20 మోడల్ స్కూళ్లలో (ఆదర్శ పాఠశాలలు) వచ్చే విద్యాసంవత్సరం (2023–24)లో 6వ తరగతిలో ప్రవేశాలు, 7 నుంచి 10వ తరగతి వరకు ఖాళీల భర్తీకి దరఖాస్తుల స్వీకరణ మొదలైంది. ప్రతిభ ఆధారంగా ప్రవేశాలను కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఆరో తరగతిలో సీటు సాధిస్తే ఇంటర్ మీడియెట్ వరకు ఎటువంటి ఫీజులు లేకుండా ఉచితంగా ఆంగ్ల మీడియంలో విద్యనభ్యసించవచ్చు. 6వ తరగతి నుంచే ఇంగ్లిష్ మీడియం విద్యాబోధనతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో సత్తా చాటేలా తీర్చిదిద్దనున్నారు. పాఠ్యపుస్తకాల్లోని అంశాలతో పాటు పాఠ్యేతర అంశాలపై శిక్షణ ఇస్తూ ప్రైవేటు పాఠశాలలకు దీటుగా బోధిస్తున్నారు. విద్యార్థులకు సరిపడ తరగతి గదులు, శబ్ద, వాయు కాలుష్యానికి దూరంగా ప్రశాంత వాతవరణంలో సీబీఎస్ఈ బోధనకు అనువైన బోధనోపకరణాలు, ఐఐటీ, జేఈఈ, మెడికల్ ఫౌండేషన్ తరగతుల నిర్వాహణ, సాంకేతిక విషయాల బోధన, సెమినార్లు, చర్చలతో కూడిన బోధన ప్రత్యేకం, ఇంగ్లీష్, సైన్స్, మ్యాథ్స్ సబ్జెక్టులకు కావల్సిన ప్రయోగశాలలు అందుబాటులో ఉన్నాయి. ఇందులో ప్రవేశం పొందిన బాలికలకు కళాశాల పక్కనే అన్ని వసతులతో వసతి గృహాలను నిర్మించారు. గ్రామాల నుంచి రోజు పాఠశాలకు రావడానికి ఇబ్బంది పడుతున్న బాలికలకు అక్కడ వసతి పొందుతూ చదువుకునే సౌకర్యం ఉంది. గతంలో విద్యార్థుల నుంచి నేరుగా దరఖాస్తులు స్వీకరించి లాటరీ పద్ధతిలో ఎంపిక చేసేవారు. పోటీ పెరగడంతో ప్రవేశ పరీక్ష నిర్వహించి ప్రతిభ ఆధారంగా విద్యార్థులను ఎంపిక చేస్తున్నారు. 6వ తరగతిలో ప్రవేశానికి నిర్వహించే పరీక్షలో ఓసీ, బీసీలకు 35, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు 30 మార్కులు పొంది ఉండాలి. ఇందులో పొందిన మార్కులు రిజర్వేషన్ ప్రకారం ప్రవేశాలు కల్పిస్తారు. ప్రవేశ పరీక్ష ప్రశ్నప్రత్రం ఆబ్జెక్టివ్ టైప్‌లో ఉంటుంది.

మోడల్ స్కూల్ ప్రత్యేకతలివే..


ఆళ్లగడ్డ ఏపీ మోడల్ స్కూల్

- సుదీర్ఘ అనుభవం ఉన్న ఉపాధ్యాయులతో ఇంగ్లిష్ మీడియంలో బోధన
- విద్యార్థులపై ప్రత్యేక పర్యవేక్షణ
- జాతీయ విద్యాసంస్థల్లో ప్రవేశం కోసం ఐఐటీ, నిట్, ఎంసెట్, వంటి జాతీయస్థాయి పోటీ పరీక్షలకు శిక్షణ
- అత్యధిక సంఖ్యలో ప్రభుత్వ, వైద్య కళాశాలల్లో ఎంబీబీఎస్, బీడీఎస్‌లలో ప్రవేశాలు పొందేలా శిక్షణ
- అత్యాధునిక డిజిటల్ తరగతులు, కంప్యూటర్ విద్య, ఆంగ్ల భాషలో మాట్లాడేందుకు స్పోకెన్ ఇంగ్లిష్‌పై శిక్షణ
- పాఠ్యాంశాలతోపాటు క్రీడలు, యోగా కళలు, యుద్ధ విద్యలో తర్ఫీదు

80 నుంచి 100 సీట్లు పెంపు

ఏటా 6వ తరగతిలో ఒక్కో పాఠశాలలో 80 మంది విద్యార్థులకు ప్రవేశాలు కల్పించేవారు. ప్రస్తుతం ప్రభుత్వం వాటిని 100 సీట్లకు పెంచుతూ తాజాగా ఉత్తర్వులు జారీ చేయడంతో ఈ విద్యాసంత్సరం నుంచి ఒక్కో పాఠశాలలో ఆరో తరగతిలో అదనంగా 20 మంది ప్రవేశాలు పొందే అవకాశం ఉండటంతో జిల్లాలోని 20 పాఠశాలల్లో 400 మంది బాలమ బాలికలకు అదనంగా అవకాశం లభించనుంది.

అర్హతలు

6వ తరగతిలో ప్రవేశాలకు ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు 2009 సెప్టెంబర్ 1 నుంచి 2013 ఆగస్టు 31 మధ్య జన్మించి ఉండాలి. ఓసీ, బీసీలకు చెందిన వారు సెప్టెంబర్ 1 – 2011 నుంచి ఆగస్టు 31 – 2013 మధ్య జన్మించి ఉండాలి.. ఏదైనా ప్రభుత్వ, గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాలల్లో 2022–23 విద్యా సంవత్సరంలో 5వ తరగతి చదివి ప్రమోషన్ అర్హత పొంది ఉండాలి.

దరఖాస్తు ఇలా..

విద్యార్థులు ఈ నెల 9 నుంచి 25వ తేదీ వరకు నెట్ బ్యాంకింగ్ / క్రెడిట్ కార్డు/ డెబిట్ కార్డులను ఉపయోగించి గేట్‌వే ద్వారా పరీక్ష ఫీజు చెల్లించిన తర్వాత ఒక నంబరు కేటాయిస్తారు. దాని ఆధారంగా ఏదైనా ఇంటర్ నెట్ సెంటర్‌లో www.ese.ap.gov.in/apms.ap.gov.in ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ఓసీ, బీసీలకు రూ 150, ఎస్సీ, ఎస్టీలకు రూ.75గా పరీక్ష ఫీజు నిర్ణయించారు. దరఖాస్తు హార్డ్ కాపీ, జత చేసిన ధ్రువీకరణ పత్రాలు, పాస్‌పోర్టు సైజ్ ఫొటో ఆయా మండల కేంద్రాల్లోని ఆదర్శ పాఠశాలల్లో అందజేయాలి.

ప్రవేశ పరీక్ష షెడ్యూల్

www.ese.ap.gov.in/apms.ap.gov.in
ఆన్‌లైన్ దరఖాస్తు: మే 9 నుంచి 25వ తేదీ వరకు
పరీక్ష తేదీ: 11 – 06– 2023
పరీక్ష సమయం: ఉదయం 10 నుంచి 12 వరకు
ఫలితాల ప్రకటన: జూన్ 16
ఎంపికైన వారి జాబితా ప్రదర్శన: జూన్ 18
సర్టిఫికెట్ల వెరిఫికేషన్: జూన్ 19
తరగతుల నిర్వహణ: జూన్ 21

బాలికలకు 33 శాతం సీట్లు

ఎస్సీలకు 15 శాతం, ఎస్టీలకు 6 శాతం, బీసీలకు 29 శాతం (బీసీ ఏ 7 శాతం, బీసీ బీ 10 శాతం, బీసీలకు 1 శాతం) కేటాయించారు. దివ్యాంగులకు 3 శాతం, బాలికలకు 33 శాతం సీట్లు బాలికలకు కేటాయించారు. నిర్దేశించిన విభాగాల్లో అభ్యర్థులు లేకపోతే ఇతర గ్రూపుల నుంచి భర్తీ చేస్తారు.

సద్వినియోగం చేసుకోవాలి



మోడల్ స్కూళ్లపై ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. విద్యార్థులకు కార్పొరేట్ స్థాయిలో ఉచితంగా వసతులు, సౌకర్యాలు కల్పిస్తోంది. దీంతో నాణ్యమైన వి ద్యను అందిస్తూ ఫలితాల్లో కార్పొరేట్‌తో పోటీ ప డుతున్నాం. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు ఇది చ క్కటి అవకాశం. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– రాజు, ప్రిన్సిపాల్, ఏపీ మోడల్ స్కూల్, ఆళ్లగడ్డ

రేపు సాక్షి ఆధ్వర్యంలో చెస్ పోటీలు



వేదిక : ఏ. క్యాంపు మాంటిస్సోరి పాఠశాల
సమయం : ఉదయం 9 గంటలకు

కర్నూలు టౌన్: సాక్షి మీడియా ఆధ్వర్యంలో ఈనెల 16వ తేదీ కర్నూలు నగరంలోని ఏ. క్యాంపు మాంటిస్సోరి పాఠశాలలో చదరంగం (చెస్) పోటీలు నిర్వహిస్తున్నారు. అండర్–8 అండర్–10, అండర్–12 అండర్–14 అండర్–16 అండర్–18 బాల బాలికల విభాగంలో ఉమ్మడి కర్నూలు జిల్లా స్థాయి చెస్ పోటీలు ఉంటాయి. టాప్ మొదటి, రెండు విభాగాలు (కర్నూలు, నంద్యాల) అలాగే అన్ని కేటగిరిలలో విజేతలకు బహుమతులు ఉంటాయి. ఆసక్తి కలిగిన బాల బాలికలు తమ పేర్లను నమోదు చేసుకునేందుకు ఈనెల 14 వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు సెంట్రల్ ప్లాజా సాక్షి కార్యాలయ ఫోన్ నెంబర్ 08518–255166 అలాగే జి. రామసుబ్బారెడ్డి 9010451585 సెల్ నంబర్‌ను సంప్రదించాల్సి ఉంటుంది. ఎలాంటి ప్రవేశ రుసుం లేదు.

'రేగడి సీమ కథలు' పుస్తకావిష్కరణ


'రేగడి సీమ కథలు' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు, సాహితీ వేత్తలు

కర్నూలు కల్చరల్: ప్రముఖ కథా రచయిత గొరెడ్డి హరిశ్చంద్రారెడ్డి రచించిన 'రేగడి సీమ కథలు' పుస్తకావిష్కరణ కార్యక్రమం ఆదివారం మద్దూరు నగర్‌లోని పింగళి సూరన తెలుగు తోటలో జరిగింది. రవీంద్ర విద్యా సంస్థల అధినేత జి.పుల్లయ్య, సాహితీ వేత్త, గాడిచెర్ల ఫౌండేషన్ అధ్యక్షులు కురాడి చంద్రశేఖర కల్కూర, టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్యలు పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మానవ జీవితం నుంచే కథలు పుట్టుకొస్తాయన్నారు. కథా రచయిత ఇనాయతుల్లా, నవ్యాంధ్ర రచయిత్రుల సంఘం రాష్ట్ర కార్యదర్శి దండోబోయిన పార్వతీ దేవి పుస్తక సమీక్ష చేశారు. కవులు, రచయితలు కల్యాణదుర్గం స్వర్ణలత, సీతామహాలక్ష్మి, ఈమని ప్రసాద్, హరికిషన్, చంద్రమౌళిని, నీలిమ, వరలక్ష్మమ్మ, రంగారెడ్డి, మాసుంబీ, మారుతి, ముద్రిక భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

నకిలీ పత్రాలతో టీడీపీ నేత భూదందాలు

- 8 మంది కేటుగాళ్లను అరెస్ట్ చేసిన పోలీసులు
- వివరాలు వెల్లడించిన నంద్యాల జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి


నిందితులను చూపుతున్న ఎస్పీ రఘువీర్‌రెడ్డి

బొమ్మలసత్రం: నంద్యాల జిల్లాగా ఏర్పాటైన రోజు నుంచి భూముల ధరలకు రెక్కలొచ్చాయి. ఇక ఇదే అదునుగా అమాయక ప్రజల స్థలాలను తప్పుడు పత్రాలతో కబ్జాలకు పాల్పడుతూ ఓ టీడీపీ నేత దందాలు కొనసాగిస్తున్నారు. స్థానిక ఉదయానంద ఆసుపత్రి వెనుక ఉన్న 50 సెంట్ల భూమి ఉందని, యజమానులు అమాయకులని గుర్తించారు. వారి కుటుంబంలో బతికి ఉన్న వ్యక్తుల చనిపోయినట్లు నకిలీ మరణ ధ్రువీకరణ పత్రాలు సృష్టించి టీడీపీ నేత అనుచరులైన ఓ పీడీఎఫ్ పత్రికా విలేకరితో పాటు మరో ముగ్గురి పేర్లపై రిజిస్టర్ చేయించుకున్నారు. ఈ భూమిని 28 మందికి విక్రయించారు. స్థలం అసలు యజమానులు రావటంతో విషయం కాస్తా బయటికి పొక్కి పోలీసులకు చేరింది. పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకుని విచారించటంతో అసలు కథ బయటపడింది. జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఆదివారం ఎస్పీ కె రఘువీర్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. మహానంది మండలం సీతారామాపురం గ్రామానికి చెందిన సంగా లక్ష్మీకాంతరెడ్డి .. టీడీపీ నాయకుడు ఏవీ సుబ్బారెడ్డికి సమీప బంధువు. లక్ష్మీకాంతరెడ్డి పట్టణంలోని ఉదయానంద ఆసుపత్రి వెనుక 50 సెంట్ల భూమిని గుర్తించి దానికి సంభంధించిన యజమానులు వెంకటలక్ష్మిబాయి అనే మహిళ పేరు ఉన్నట్లు తెలుసుకున్నాడు. ఈవిషయాన్ని తన అనుచరులు పట్టణానికి చెందిన పీడీఎఫ్ పత్రిక విలేకరి చవ్వా పవన్, రౌడీషీటర్ తిరుమల, సంజీవ, మూలాలి, ఖాసీం, శ్రీనివాసులుతో కలిసి కబ్జా చేసేందుకు ప్లాన్ వేశారు. అసలు యజమాని అయిన వెంకటలక్ష్మిబాయి బతికుండగానే చనిపోయినట్లు నకిలీ పత్రం తయారు చేసి స్థానిక స్టాంప్ రైటర్లు సుమంత్, అస్లామ్‌బాషా, దాదాపీర్, నబిరసూల్ సహకారంతో రిజిస్టర్ చేసుకున్నారు. వెంకటలక్ష్మిబాయి పేరుతో నకిలీ ఫ్యామిలీ మెంబర్ పత్రం తయారు చేసి అందులో లక్షమ్మ అనే పేరుతో ఉన్న మహిళ ద్వారా రిజిస్టర్ చేసుకున్న స్థలాన్ని 28 మందికి విక్రయించారు. విషయం తెలుసుకున్న స్థలం అసలు యజమాని అందరికి నోటీసులు పంపాడు. స్థలం కొనుగోలు చేసిన కిరణ్ అనే వ్యక్తి సూత్రధారులను దండించగా చంపుతామని బెదిరింపులకు దిగటంతో స్థానిక తాలూకా పోలీసులకు బాధితుడు గత నెల 24న ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు నిందితులపై ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేసి అదుపులోకి తీసుకుని విచారించారు. అయితే నకిలీ పత్రాలతో ఈవ్యవహారం నడిపినట్లు వారు అంగీకరించటంతో నిందితులపై అదనపు సెక్షన్లులు జోడించి ఆదివారం రిమాండ్‌కు తరలించారు. టీడీపీ నాయకుడు లక్ష్మీకాంతారెడ్డి పరారీలో ఉన్నాడని ఎస్పీ కె రఘువీర్‌రెడ్డి తెలిపారు. నిందితుల నుంచి నకిలీ రబ్బర్ స్టాంప్‌లు, కొన్ని పత్రాలు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ సమావేశంలో డీఎస్పీ మహేశ్వర రెడ్డి, సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

చోరీ కేసులో నిందితుల అరెస్ట్

బొమ్మలసత్రం: పాణ్యం మండలం తొగడ్చేడు గ్రామంలో గత నెల 29న జరిగిన చోరీ కేసులో ఇద్దరు నిందితులను పోలీసులు ఆదివారం అరెస్ట్ చేశారు. వివరాలను ఎస్పీ కె రఘువీర్‌రెడ్డి తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. తొగడ్చేడు గ్రామానికి చెందిన రైతు అంజన్‌కుమార్‌రెడ్డి గత నెల 29న కుటుంబ సభ్యులతో కలిసి అన్నవరం సత్యనారాయణ స్వామి దర్శనం కోసం ఇంటికి తాళం వేసి వెళ్లిపోయారు. ఈనెల 2న తిరిగి వచ్చేలోగా ఇంటి తాళాలు పగలగొట్టి ఉండటంతో లోపలికి వెళ్లి చూశారు. బీరువాలో ఉన్న 15 తులాల బంగారు ఆభరణాలు, రూ.1.60 లక్షల నగదు మాయమైనట్లు గుర్తించి పాణ్యం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టారు. ఆదివారం ఉదయం పాణ్యం శివారులో అనుమానాస్పదంగా తిరుగుతున్న తొగడ్చేడు వెంకటేశ్వరరెడ్డి, రేగడగూడూరు దుర్వేష్ ఖాద్రిలను అదుపులోకి తీసుకుని విచారించగా చోరీ చేసినట్లు అంగీకరించారు. నిందితులను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి బంగారు, నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ తెలిపారు. సమావేశంలో డీఎస్పీ మహేశ్వరరెడ్డి, పాణ్యం సీఐ వెంకటేశ్వర రావు, ఎస్ఐ సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

అపార్ట్‌మెంట్‌పై నుంచి దూకి వృద్ధుడి ఆత్మహత్య


మృతిచెందిన మగ్బుల్‌బాషా

బొమ్మలసత్రం: లివర్ సంబంధిత వ్యాధితో తాళలేక పట్టణానికి చెందిన షేక్ మక్బుల్ (75) అపార్ట్‌మెంట్‌పై నుంచి దూకి ఆదివారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుని కుమారుడు ఫరూక్ బాషా తెలిపిన వివరాల మేరకు.. పట్టణంలోని సుద్దులపేట వీధికి చెందిన షేక్ మక్బుల్ కారు డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. కొంత కాలం క్రితం లివర్ సంబంధిత వ్యాధి సోకింది. వైద్యుల దగ్గరికి వెళ్లినా నయం కాలేదు. తన భార్య రొమ్ము క్యాన్సర్ వ్యాధితో పడుతోంది. శనివారం రాత్రి మగ్బుల్‌కు తీవ్ర కడుపునొప్పి రావటంతో ఇంట్లో నుంచి బైటికి వచ్చాడు. రాత్రి అందరూ నిద్రించే సమయంలో సమీపంలోని తిరుమల అపార్ట్‌మెంట్‌పై నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఉదయం తన తండ్రి కోసం గాలిస్తుండగా అపార్ట్‌మెంట్ ఎదురుగా నిర్జీవంగా గాయాలతో మగ్బుల్ కనిపించాడు. టూటౌన్ పోలీసులకు సమాచారం ఇవ్వటంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడి కుమారుడు ఫరూక్‌బాషా ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ఇష్టంలేని వివాహం చేస్తున్నారని..

- మనస్తాపంతో ఉరివేసుకొని యువకుడు ఆత్మహత్య


అవుకు కిషోర్ (ఫైల్)

జూపాడుబంగ్లా: ఇష్టంలేని వివాహం చేస్తున్నారని మనస్తాపం చెంది ఓ యువకుడు ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన తూడిచెర్ల గ్రామంలో ఆదివారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. ఎస్ఐ వెంకటసుబ్బయ్య తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన లక్ష్మిదేవి, పోలయ్య దంపతుల కుమారుడు కిషోర్‌కు నంద్యాల మండలం బిళ్లలాపురం గ్రామానికి చెందిన మేనమామ కుమార్తెతో వివాహం నిశ్చయమైంది. వివాహం ఇష్టలేదని కిషోర్ చెప్పినా తల్లిదండ్రులు వినలేదు. దీంతో మనస్తాపానికి గురై ఆదివారం తెల్లవారుజామున ఇంట్లోవారందరూ నిద్రలో ఉండగా ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకొన్నాడు. ఎస్ఐ వెంకటసుబ్బయ్య ఘటనా స్థలానికి చేరుకొని మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

సాంకేతిక ఏవో డిప్యుటేషన్ పొడిగింపు

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయంలో సాంకేతిక వ్యవసాయ అధికారిగా పనిచేస్తున్న అల్లీపీరా డిప్యుటేషన్ గడువును ఆరు నెలలు పొడిగిస్తూ వ్యవసాయ శాఖ కమిషనర్ హరికిరణ్ ఉత్తర్వులు జారీ చేశారు. అల్లీపీరా డిప్యుటేషన్ గడువు ఈ నెల 31తో ముగియనుంది. జూన్ 1 నుంచి ఆరు నెలల పాటు డిప్యుటేషన్ పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

కల్వటాల సర్పంచ్ చెక్‌పవర్ రద్దు

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని కల్వటాల పంచాయతీ సర్పంచ్ చెక్‌పవర్ రద్దు చేస్తూ జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాసులు ఉత్తర్వులు జారీ చేశారు. పంచాయతీ నిధులు దుర్వినియోగం చేసినట్లు ఇటీవల ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందాయి. డీఎల్‌పీఓ విచారణలో నిధుల దుర్వినియోగంతో పాటు పంచాయతీలో మీటింగ్‌లు నిర్వహించక పోవడం, విధుల పట్ల అలసత్వం వహించడం తదితర కారణాలు వెలుగుచూశాయి. ఈమేరకు సర్పంచ్ చెక్‌పవర్ రద్దు చేసి ఉపసర్పంచ్, ఈఓఆర్డీలకు జాయింట్ చెక్‌పవర్ కల్పిస్తూ ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకున్నారు.

నాగలదిన్నె బ్రిడ్జి వద్ద గుర్తు తెలియని మృతదేహం

నందవరం: నాగలదిన్నె బ్రిడ్జి కింద 9, 10 పిల్లర్స్ మధ్యలో గుర్తు తెలియని మృతదేహం కనిపించిందని ఎస్ఐ మహేష్‌కుమార్ తెలిపారు. మృతిడి వయస్సు సుమారు 25 నుంచి 30 ఏళ్ల లోపు ఉంటుందని, కుడి చేతికి ఆరెంజ్ కలర్ బ్యాండేజీ ఉందన్నారు. బ్యాండేజీపై జై భజరంగి అని ఉందని, కుడి చేతికి ఎర్రదారం, ఎడమ చేతికి కడియం, గొంతులో ఎర్రదారంతో పాటు ఆంజనేయ స్వామి బిల్ల, ఎర్రటి మొలతాడు ఉందని తెలిపారు. మృత దేహం గురించి సమాచారం తెలిసిన వారు సీఐ మోహన్‌రెడ్డి ఎమ్మిగనూరు రూరల్ 9121101146, ఎస్ఐ నందవరం 9121101159 నంబర్లను సంప్రదించాలన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ వెల్లడించారు.

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడ మైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.